సాక్షి యాదాద్రి భువనగిరి

శనివారం । 7 । సెప్టెంబర్ । 2024



పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా వ్యాధులు దరిచేరవని ఐసీడీఎస్ అధికారులు సూచించారు.

- 11లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 589.90 అడుగులు
ఇన్‌ఫ్లో	: 2,36,180 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 1,94,160 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 28,095క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 8,490 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 3,035 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1800
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం:	642.65 అడుగులు
ఇన్‌ఫ్లో	: 5,670 క్యూసెక్కులు
క్రస్ట్ గేట్లు	: 5,670 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: నిల్
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

పోచంపల్లి చేనేత సంఘం ఎన్నికల బరిలో 28 మంది

భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లి పద్మశాలి చేనేత కార్మిక సంఘం ఎన్నికల బరిలో 28 మంది నిలిచారు. మొత్తం 29 నామినేషన్లు దాఖలు కాగా శుక్రవారం ఉపసంహరణ నిర్వహించారు. అధ్యక్ష స్థానానికి ఆరుగురు నామినేషన్ వేయగా ఏలే శ్రీనివాస్ ఒక్కరే ఉపసంహరించుకున్నారు. దాంతో అధ్యక్ష స్థానానికి అంకం పాండు, కొంక లక్ష్మీ నారాయణ, మునునూరి యాదగిరి, కర్నాటి పురుషోత్తం, సీత కృష్ణ మొత్తం ఐదుగురు పోటీ పడుతున్నారు. ఇక డైరెక్టర్ స్థానాల్లో రెండు మహిళలకు రిజర్వ్ కాగా మునునూరి లక్ష్మి, గుండు రాజేశ్వరి, ఏర్వ నీలమ్మ, గుర్రం హేమలత బరిలో ఉన్నారు. 8 జనరల్ స్థానాలకు 19 మంది పోటీపడుతున్నారు. అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు.

2,519 మంది ఓటర్లు

మొత్తం 2,519 మంది ఓటర్లు ఉన్నారు. ఈ నెల 15న పోచంపల్లిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించనున్నారు. 16న ఓట్ల లెక్కించి అదే రోజు ఫలితాలు వెల్లడిస్తామని ఎన్నికల అధికారులు సీత శ్రీరాములు, అంకం మురళి తెలిపారు.

హైవేపై వాహనాల రద్దీ



చౌటుప్పల్‌లో క్యూకట్టిన వాహనాలు

చౌటుప్పల్ : హైదరాబాద్ – జాతీయ రహదారిపై శుక్రవారం వాహనాల రద్దీ నెలకొంది. వినాయక చవితి, వీకెండ్ వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో హైదరాబాద్ జంటనగరాల్లో ఉంటున్న ప్రజానీకం పండుగకు తమ స్వస్థలాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. చౌటుప్పల్ పట్టణంలో రోడ్డు క్రాస్ చేయడానికి పట్టణవాసులు ఇబ్బందులు పడ్డారు.

ఆత్మకూర్(ఎం) మండలంలో భారీ వర్షం



టి.రేపాకలో రోడ్డుపై కూలిన చెట్టు

ఆత్మకూరు(ఎం) : మండలంలో శుక్రవారం సాయంత్రం సుమారు అరగంట సేపు భారీ వర్షం కురిసింది. వర్షానికి ఈదురు గాలులతో తోడవడంతో అక్కడక్కడ చెట్లు నేలకూలాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

ఓపీ సేవలు పెంచాలి

భువనగిరి : ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్‌లలో ఓపీ సేవలు పెంచాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిల్పిని సిబ్బందికి సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సూపర్‌వైజర్లతో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో 14 రకాల వైద్య పరీక్షలు చేయడానికి అవకాశం ఉందని, వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో ఇంటింటికి వెళ్లి సర్వే చేసి జ్వరపీడితులను గుర్తించాలని పేర్కొన్నారు. రక్తనమూనాలు సేకరించి పరీక్షలకు పంపాలని, అవసరాన్ని బట్టి చికిత్స అందించాలని సూచించారు. పీహెచ్‌సీల్లో కాన్పుల సంఖ్య పెంచాలని పేర్కొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజం



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి

రామన్నపేట : పోషకాహారం అందించడం వల్ల ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని, దీనిపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని జిల్లా సంక్షేమ అధికారిణి కృష్ణవేణి సూచించారు. పోషణ మాసోత్సవంలో భాగంగా శుక్రవారం రామన్నపేట ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. పిల్లల వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ రకాల ఆహార పదార్థాలతో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీఓ యాకుబ్‌నాయక్, సీడీపీఓ వెంకటరమణ, ఏసీడీపీఓ సమీరా, ఏపీఓ వెంకన్న, హెచ్‌ఈఓ గోపాల్, సూపర్‌వైజర్లు హేమలత, బాలమణి పాల్గొన్నారు.

రావయ్యా.. గణపయ్యా



భారీ గణపయ్యను హైదరాబాద్‌లో కొనుగోలు చేసి ట్రాక్టర్‌లో భూదాన్‌పోచంపల్లికి తరలిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



వినాయకుడిని ప్రతిష్ఠించేందుకు భూదాన్‌పోచంపల్లి మండలం రేవనపల్లిలో ప్రత్యేక అలంకరణతో సిద్ధం చేసిన మండపం

కొత్త రుణాలకు కొర్రీలు

రుణమాఫీదారులకు సహకరించని బ్యాంకులు

- మాఫీ ప్రక్రియ పూర్తి చేయకుండా జాప్యం
- బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ రైతుల ప్రదక్షిణలు



సంస్థాన్ నారాయణపురం: బ్యాంకుల తీరుతో రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. రుణమాఫీ జరిగినా ప్రక్రియ పూర్తి చేయకపోవడంతో కొత్త లోను మంజూరు కావడం లేదు. ఫలితంగా రైతులు పంట పెట్టుబడి కోసం ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల మూడు విడతల్లో ప్రభుత్వం పంట రుణాలు మాఫీ చేసింది. కాగా కటాఫ్ తేదీ 2023 డిసెంబర్ 9 తర్వాత వడ్డీ కట్టించుకుని రుణం ఖాతా క్లోజ్ చేయాలి. ఆ తరువాత రైతులకు కొత్త రుణం మంజూరు చేయాలి. కానీ, బాకీ తీర్చినా బ్యాంకులు కొర్రీలు పెడుతున్నట్లు రైతులు వాపోతున్నారు.

వడ్డీ చెల్లించినా ఇబ్బందులే..

- చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం ఎస్‌బీఐలలో రుణం పొందిన పలువురు రైతులు కటాఫ్ తేదీ తర్వాత వడ్డీ పూర్తిగా చెల్లించారు.కొత్త రుణం కోసం అసరమైన ధ్రువీకరణ పత్రాలన్నీ బ్యాంకులకు సమర్పించారు. కానీ, రుణం మంజూరు చేయకుండా కొర్రీలు పెడుతుండడంతో రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.
- పుట్టపాక కెనరా బ్యాంకులో రుణాలు పొందిన పలువురు రైతులు కటాఫ్ తేదీ ముందు తీసుకున్న రుణం వడ్డీతో సహా చెల్లించారు. కానీ, రుణమాఫీ జాబితాలో వడ్డీ మాఫీ కానట్లు చూపుతోంది. బ్యాంకర్లు రైతుల నుంచి వడ్డీ వసూలు చేసి, వారి రుణం ఖాతా క్లోజ్ చేస్తున్నారు. ఇక్కడ కొత్త రుణాలు మంజూరు చేస్తున్నప్పటికీ వడ్డీ చెల్లించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.
- పుట్టపాక కెనరా బ్యాంకు, చౌటుప్పల్ ఎస్‌బీఐలో రుణం తీసుకున్న పలువురు రైతులకు రుణమాఫీ జరిగినట్లు జాబితాలో పేర్లు వచ్చాయి. రుణమాఫీ అయినట్లు సెల్‌ఫోన్లకు సమాచారం కూడా వచ్చింది. కానీ, బ్యాంకులకు వెళ్తే మాఫీ కాలేదని అధికారులు చెబుతున్నట్లు రైతులు తెలిపారు. కారణాలపై ఆరాతీయగా బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రుణం తీసుకున్నప్పుడు తెరిచిన ఖాతాను ఆ తరువాత రెన్యూవల్ చేసుకున్నప్పుడు బ్యాంకు అధికారులు క్లోజ్ చేశారు. మళ్లీ రుణం తీసుకున్న సమయంలో కొత్త ఖాతా తెరిచి లోన్ ఇచ్చారు. పాత ఖాతా నంబర్‌పై రుణమాఫీ రావడంతో రైతులు మాఫీకి నోచుకోలేదు. చాలా బ్యాంకుల్లో ఇటువంటి పరిస్థితే నెలకొంది.

బ్యాంకుకు నాలుగుసార్లు తిరిగినా..



సంస్థాన్ నారాయణపురం ఎస్‌బీఐ లో రూ.60 వేలు రుణం తీసుకున్న. రుణమాఫీ జరిగినట్లు మొదటి విడత జాబితాలోనే పేరు వచ్చింది. కొత్త లోను కోసం బ్యాంకులో అవసరమైన పత్రాలు ఇచ్చాను. పది రోజులు గడిచినా కొత్త రుణం ఇవ్వలేదు. ఇప్పటికి నాలుగు సార్లు బ్యాంకుకు వెళ్లాను.

-కొర్ర వాల్య, కొర్రతండా

మిత్తి మాఫీ కాలేదు



పుట్టపాక కెనరా బ్యాంకులో గత సంవత్సరం ఆగస్టులో రూ.60 వేలు అప్పు తీసుకున్నా. రూ.60 వేలు రుణ మాఫీ అయ్యింది. మిత్తి మాఫీ కాలేదు. బ్యాంకులో మిత్తి చెల్లించి కొత్త రుణం రూ.60వేలు తీసుకున్నా.

-ఎం.సత్తిరెడ్డి, బట్టోనిబావి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..

పుట్టపాక, సంస్థాన్ నారాయణపురం బ్యాంకుల్లో రుణమాఫీ అయిన రైతులకు కొత్త రుణాలు ఇవ్వడం లేదని పలువురు తన దృష్టికి తీసుకవచ్చారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉంది.

-పావని, వ్యవసాయ అధికారి
సంస్థాన్‌నారాయణపురం మండలం

రుణమాఫీ కాలేదు



గతంలో పుట్టపాక కెనరా బ్యాంకులో రూ.95వేలు రుణం ఉంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రుణమాఫీ చేసినప్పుడు ప్రభుత్వం ప్రకటించిన లిస్టులో నా పేరు ఉంది. కానీ, రుణం రెన్యూవల్ చేసే సమయంలో కొత్త ఖాతా నంబర్ ఇచ్చారు. పాత ఖాతాకు రుణమాఫీ కావడంతో డబ్బులు వెనక్కి పోయాయి.

-మర్రి కాంతరెడ్డి, పుట్టపాక

పెట్టుబడికి ఇబ్బంది పడుతున్నాం



సంస్థాన్ నారాయణపురం ఎస్‌బీఐలో రుణం తీసుకున్నాను. మొదటి విడతలో రూ.47వేలు మాఫీ అయ్యింది. కొత్త రుణం కోసం ఐదుసార్లు బ్యాంకు వెళ్లొచ్చిన. ఇంకా రెండు నెలల సమయం పడుతుందని చెబుతున్నారు. పాస్‌బుక్ అడిగితే ఇచ్చాను. పంట సాగుకు పెట్టుబడిలేక ఇబ్బందులు పడుతున్నాం.

-వాంకుడోతు నాను, బోటిమీదితండా

సెల్ఫీ విత్ గణేశ్



మీరు విఘ్నేశ్వరుడిని ప్రత్యేక ఆకృతుల్లో ప్రతిష్ఠించారా.. పర్యావరణాన్ని కాపాడే రీతిలో గానీ, ఏ అంశంపైనైనా సమాజానికి సందేశం ఇచ్చే రీతిలో మీ వినాయకుడు ఉన్నాడా.. మీ కాలనీల్లో, అపార్ట్‌మెంట్‌లలో ఏర్పాటు చేసుకున్న వినాయకుడు ఏదైనా స్పెషల్ గెటప్‌లో ఉన్నాడా.. అయితే, మీ వినాయకుడితో మీరు సెల్ఫీ తీసుకుని మాకు పంపితే.. ఆ ఫొటోలలో ఎంపిక చేసి ప్రచురిస్తాం.

మీరు సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నం. 80962 93702

ఉద్యమ నేతకు కన్నీటి వీడ్కోలు



బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజానీకం



జిట్టా అంతిమయాత్రలో పాల్గొని పాడె మోస్తున్నఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజాగోపాల్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



జిట్టా బాలకృష్ణారెడ్డి పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తదితరులు

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం



స్వయం సహాయక సంఘాల సభ్యులతో కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సాక్షి,యాదాద్రి : మహిళలను సంఘటితం చేస్తూ, వారు ఆర్థిక స్వావలంబన సాధించడమే లక్ష్యంగా జిల్లా మహిళా సమాఖ్య పని చేస్తుందని కలెక్టర్ హనుమంతు కే.జెండగే పేర్కొన్నారు. శుక్రవారం భువనగిరిలో నిర్వహించిన జిల్లా మహిళా సమాఖ్య ఏడో వార్షిక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పశు ఆధారిత జీవనోపాదుల పథకం, వ్యవసాయేతర జీవనోపాదులు, బ్యాంక్ లింకేజీ రుణాలు, సామాజిక కార్యక్రమాలు, 2024–2025 ఆర్థిక సంవత్సరానికి గాను రుణ ప్రణాళిక తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలతో అనుసంధానం చేయడానికి మహిళా సమాఖ్య వారధిగా ఉపయోగపడుతుందన్నారు. అంతేకాకుండా మండల సమాఖ్యలను సమన్వయపరిచి, పరస్పరం సహకరించుకునేలా పని చేస్తుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గంగాధర్, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు రేణుక, ప్రధాన కార్యదర్శి సంతోషి, కోశాధికారి మౌనిక, అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్, డీపీఎంలు పాల్గొన్నారు.

మందులు అందుబాటులో ఉంచండి

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



ఆలేరు సీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అయిలయ్య, పక్కన కలెక్టర్

ఆలేరురూరల్ : సీజనల్ వ్యాధులకు సంబంధించి అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆలేరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)ను కలెక్టర్ హనుమంతు కే.జెండగతో కలిసి తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రికార్డులు, ల్యాబ్, మందుల స్టోర్, ఇన్‌పేషంట్ వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో డాక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విధిగా సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన సేవలు అందించాలని పేర్కొన్నారు. మందుల కొరత ఏర్పడితే తక్షణమే జిల్లా అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో డాక్టర్లను నియామకం చేస్తామని, ఎక్స్‌రే తీయడానికి టెక్నీషియన్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆలేరు ఆస్పత్రి సామర్థ్యాన్ని త్వరలో 50 పడకలకు పెంచుతామని, డయాలసిస్ కేంద్రంలో అదనంగా పది బెడ్లు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ స్వప్న ఉన్నారు.

అందని వేతనం.. బతుకు భారం!

- పంచాయతీ కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు పెండింగ్
- భారంగా మారిన కుటుంబ పోషణ
- జిల్లా వ్యాప్తంగా 2,506 మంది కార్మికుల ఎదురుచూపు



సిరిపురంలో పాఠశాల పరిసరాలను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు (ఫైల్)

రామన్నపేట : గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలే జీవనాధారం. ఐదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నచిన్న అవసరాలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని కార్మికులు వాపోతున్నారు.

పంచాయతీలు, కార్మికులు..

జిల్లాలో 421 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గత నెలలో మరో ఏడు కొత్త పంచాయతీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా వ్యాప్తంగా 2,506 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో సుమారు 1,200 మంది పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు. మిగిలిన వారిలో వాటర్‌మెన్లు, డ్రైవర్లు, ఎలక్ట్రీషియన్లు, కారోబార్లు, బిల్‌కలెక్టర్లు ఉన్నారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులను మల్టీపర్పస్ కార్మికులుగా గుర్తించి ఒక్కొక్కరికీ రూ.9,000 వేతనం చెల్లిస్తున్నారు. అనుభజ్ఞులైన కారోబార్లకు రూ.10 వేలనుంచి రూ.15వేల వరకు ఇస్తున్నారు.

కార్మికుల విధులు ఇవీ..

డ్రైయినేజీలు, వీధులను శుభ్రం చేయడం, ప్రజలకు రోజూ మంచినీరు అందించడం, వీధి దీపాలు అమర్చడం, వీధుల్లోని చెత్తను సేకరించి డంపింగ్‌యార్డులకు తరలింపు, మొక్కలకు నీళ్లు పోయడం, పండుగల సమయాల్లో ఆలయ పరిసరాల పరిశుభ్రత వంటి పనులు చేయాలి. వీటితో పాటు అధికారిక కార్యక్రమాలు, గ్రామసభల నిర్వహణ ఏర్పాట్లు చూడాలి. ఊరికి ఏ అధికారి ప్రజాప్రతినిధి వచ్చినా తిరిగి వెళ్లేవరకు దగ్గరుండి ఏర్పాట్లు చేయాలి.

నిలిచిన ఆర్థిక సంఘం నిధులు

కార్మికులకు గ్రామ పంచాయతీ జనరల్ ఫండ్ నుంచి వేతనాలు చెల్లిస్తారు. ఇంటి పన్ను, నల్లా బిల్లుల ద్వారా వచ్చే ఫండ్ అంతంతమాత్రంగానే ఉంటుంది. 15వ ఆర్థిక సంఘం, స్పెషల్ ఫండ్‌ను వేతనాల చెల్లింపునకు వాడుకునే వెసులుబాటు ఉన్నది. కాగా జనవరి నుంచి 15వ ఆర్థిక సంఘం, ఎస్‌ఎఫ్‌సీ నిధులు రావడం లేదు. దీంతో పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదు. జనరల్ ఫండ్ ఉన్న పంచాయతీలు సిబ్బంది వేతనాల కోసం జారీ చేసిన చెక్కులు ఎస్టీఓలలో పాస్ కావడం లేదు. ఐదారు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం వల్ల కుటుంబం గడవడం కష్టంగా మారిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భారంగా పంచాయతీల నిర్వహణ

స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో పంచాయతీల నిర్వహణ భారం కార్యదర్శులపై పడింది. బోనాలు పండుగల నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, విద్యుత్ మోటార్లు, పైప్‌లైన్ మరమ్మతుల కోసం తమ శక్తికి మించి ఖర్చు చేశామని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇల్లు గడవడం కష్టంగా ఉంది



సిరిపురం గ్రామ పంచాయతీలో 20 ఏళ్లుగా పనిచేస్తున్నా. ఎప్పుడైనా రెండు మూడు నెలలకు మించి వేతనం ఆగలేదు. ఇప్పుడు ఆరో నెల నడుస్తుంది. ఇన్ని నెలలు వేతనం ఇవ్వకుంటే ఇల్లు ఎట్ల గడుస్తదో పెద్దలు ఆలోచన చేయాలి. అరువు కూడా ఇస్తలేరు. నెలనెలా వేతనాలు చెల్లించాలి.

-మంచాల రేణుక, కార్మికురాలు, సిరిపురం

ప్రభుత్వమే చెల్లించాలి



గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. బడ్జెట్‌లో నిధులు కేటాయించి ప్రభుత్వమే నెలనెలా వేతనాలు చెల్లించాలి. కనీస వేతనచట్టం అమలు చేయాలి. పెండింగ్ వేతనాలను చెల్లించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలి. ఎస్టీఓలలో ఆగిన చెక్కులను పాస్ చేయాలి.

-బందెల భిక్షం, పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు

నేత్రపర్వంగా ఊంజల్ సేవ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ తిరు, మాఢ వీధుల్లో ఊరేగించారు. అమ్మవారి సేవకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో సేవను అధిష్ఠించి ఊంజల్ సేవోత్సవం నిర్వహించారు. అదే విధంగా ప్రధానాలయంలో నిత్యకైంకర్యాలు కొనసాగాయి.



అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి బలవన్మరణం

బీబీనగర్: వ్యాపారంలో నష్టం వచ్చి ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో బీబీనగర్‌లో ఓ వ్యక్తి శుక్రవారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్‌కు చెందిన ఉప్పలంచి రమేష్(50) గేదెల వ్యాపారంతో పాటు కిరాణ షాపు నడిపిస్తున్నాడు. ఇటీవల తన వ్యాపారంలో నష్టం వాటిల్లడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో మానసిక ఒత్తిడికి గురైన రమేష్ శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో ఓ రేకుల గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య పుష్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అగ్నిప్రమాదంలో వలస కార్మికుడి మృతి

భూదాన్‌పోచంపల్లి : ప్రమాదవశాత్తు ఓ కంపెనీలో జరిగిన అగ్నిప్రమాదంలో వలస కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మున్సిపాలిటీ పరిధిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని నారాయణగిరి మాస్‌ప్యాక్ కంపెనీలో కోటింగ్ సెక్షన్ రూమ్‌లో పేపర్ ప్యాకింగ్ బాక్సులకు వార్నిష్ పేయింట్ కోటింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్ జరిగి నిప్పురవ్వలు వచ్చి పేయింట్ బాక్సులకు అంటుకొని పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. దీంతో అందులో పనిచేస్తున్న అస్సాం రాష్ట్రానికి చెందిన కార్మికుడు బిషల్ రాయ్(19) మంటలు అంటుకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే గమనించిన కంపెనీ యాజమాన్యం బాధితుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు రాత్రి ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును తెలుసుకొని వివరాలు నమోదు చేశారు. మృతుడి అన్న బిక్కిరాయ్ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

మద్యం పట్టివేత

మోత్కూరు : మోత్కూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని అడ్డగూడూరు మండలం మానాయికుంటలో అక్రమంగా మద్యం నిల్వ ఉందనే సమాచారంతో శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 14ఐబీ, 13ఓసీ క్వాటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రవిచంద్రారెడ్డి తెలిపారు.

ప్రజా సమస్యలే ఎజెండాగా పోరాటం

- వివేకానందుని స్ఫూర్తితో.. యువతను ఏకం చేసిన జిట్టా
- తెలంగాణ మలిదశ ఉద్యమంలో బాలకృష్ణారెడ్డిది ప్రత్యేక పాత్ర
- మూసీ ప్రక్షాళన కోసం పాదయాత్ర
- చివరకు ఉద్యమ పార్టీలోనే తుదిశ్వాస విడిచిన నేత

సాక్షి,యాదాద్రి : తెలంగాణ అస్థిత్వం, తన ప్రాంత ప్రజల అభివృద్ధి, యువత బాగోగుల కోసం జీవితాంతం రాజీలేని పోరాటం చేశారు జిట్టా బాలకృష్ణారెడ్డి. హైదరాబాదులో 1992లో వివేకానంద యువజన సంఘం స్థాపించారు. రాష్ట్ర స్థాయిలో యువజన సంఘాల సమితిని ఏర్పాటు చేసి 10వేల సంఘాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చారు. 1992 నుంచి ఇప్పటి తుది శ్వాస విడిచే వరకు స్వామి వివేకానందుడి బాటలో పయనించారు. యువతను చైతన్య పరిచి.. సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఉచిత ఆరోగ్య శిబిరాలు, గ్రామీణ క్రీడలు, శ్రమదానం, రక్తదానాలను ప్రోత్సహించారు. జిట్టా స్వయంగా 18 సార్లు రక్తదానం చేశారు. గుమ్మి విజయ్ కాంత్ రెడ్డి కన్వీనర్‌గా, మహేష్ ఆదిత్య కోకన్వీనర్‌గా ఉత్తర అమెరికాలో యువజన సంఘాల సమితి ఏర్పాటు చేసి దాని ద్వారా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.

విద్య కోసం చేయూత

తన మేనమామ, ప్రవాస భారతీయుడు డాక్టర్ చిలుముల రాంచంద్రారెడ్డి ఫౌండేషన్ సాయంతో 2003లోనే రూ.1.20 కోట్ల వ్యయంతో భువనగిరిలో అమ్మమ్మ తాత పేర్లతో చిలుముల శివరాజిని నారాయణరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మించారు. భువనగిరిలోని సీఎస్ఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద స్వామి వివేకానంద కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. తన తల్లి జిట్టా రాధమ్మ పేరుతో ఏర్పాటు చేసిన ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేశారు.


తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా భువనగిరి సభలో కేసీఆర్‌కు గొర్రెను బహూకరిస్తున్న జిట్టా (ఫైల్)


మూసీ ప్రక్షాళన పాదయాత్ర సందర్భంగా మాట్లాడుతున్న జిట్టా బాలకృష్ణారెడ్డి (ఫైల్)

వ్యక్తిగత వివరాలు

పేరు : జిట్టా బాలకృష్ణారెడ్డి
జననం: 14-12-1972
తల్లిదండ్రులు : రాధమ్మ- బాల్ రెడ్డి (రిటైర్డ్ టీచర్)
భార్య : సునీత
సంతానం : వివేకానందరెడ్డి, ఝాన్సీ
విద్యార్హతలు : బీకాం
జన్మస్థలం : బొమ్మాయిపల్లి, భువనగిరి మున్సిపాలిటీ

మూసీ ప్రక్షాళనకు పాదయాత్ర

మూసీ నది ప్రక్షాళన కోసం 200 కిలో మీటర్ల పాదయాత్ర చేశారు బాలకృష్ణారెడ్డి. 2005 ఏప్రిల్ 10వ తేదీ నుంచి ఏప్రిల్ 17వ తేదీ వరకు వలిగొండ నుంచి గ్రామాలు పర్యటిస్తూ హైదరాబాద్ వరకు పాదయాత్ర చేపట్టారు. అదే హైదరాబాద్‌లో భారీ బహిరంగసభ నిర్వహించారు. అప్పటి ప్రభుత్వం మూసీ జలాల శుద్ధికి రూ.350 కోట్లు విడుదల చేసింది.

మూడున్నర కోట్లతో వాటర్ ప్లాంట్లు

భువనగిరి నియోజకవర్గంలో ప్రజలు రక్షిత మంచినీటి కోసం రూ.మూడున్నర కోట్ల నిధులతో 106 గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. వాటర్ ప్లాంట్లు జిట్టా బాలకృష్ణారెడ్డే ఈ ప్రాంత ప్రజలకు పరిచయం చేశారు. 2006వ సంవత్సరంలోనే భువనగిరి ప్రాంత ప్రజలకు కేవలం రెండు రూపాయలకే ఒక క్యాన్ నీటిని అందించారు. నేటికి ఇంకా కొన్ని చోట్ల జిట్టా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లు నీరందిస్తున్నాయి. 2008లో భువనగిరిలోని కిసాన్‌నగర్‌లో రూ.6 లక్షల తన సొంత నిధులతో పార్కును అభివృద్ధి చేశారు. 30 మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు ఫీజులు చెల్లించి ఆదుకున్నారు.

నిమ్స్ కోసం అలుపెరుగని పోరాటం

జిట్టా బాలకృష్ణారెడ్డి ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేశారు. బీబీనగర్ వద్ద నిమ్స్.. ఎయిమ్స్‌గా మరే వరకు వివిధ రూపాల్లో పోరాటం చేశారు. 2005లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసి నిమ్స్‌ను 2009లో పూర్తి చేసి ప్రారంభించే వరకు రాజీలేని పోరాటం చేశారు. 2017లో తెలంగాణ సర్కారు ఈ ఆస్పత్రిని సినిమా షూటింగుల కోసం ఇచ్చే ప్రయత్నం చేస్తే దానిని అడ్డుకునే పోరాటం చేశారు జిట్టా. ఈ క్రమంలో అప్పటి ప్రభుత్వం కేసు నమోదు చేయడంతో మూడు రోజులు జైలుకు వెళ్లారు.

స్వచ్ఛమైన సాగునీటి కోసం పోరు

భువనగిరి నియోజకవర్గ రైతాంగానికి కృష్ణా జలాలు ఇవ్వాలన్న డిమాండ్‌తో నియోజకవర్గంలో 2008లో 350 కిలో మీటర్ల పాదయాత్ర చేశారు. మూసీ కాలువలైన బునాదిగాని కాలువ, పిల్లాయిపల్లి కాలువ, బొల్లేపల్లి కాలువ కోసం ధర్నాలు, రాస్తారోకోలు, దీక్షలతో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు.

యువ తెలంగాణ జేఏసీ ఏర్పాటు

తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా పనిచేసిన జిట్టా బాలకృష్ణారెడ్డి యువ తెలంగాణ జేఏసీని ఏర్పాటు చేశారు. తెలంగాణ రణభేరి, తెగదెంపుల సంగ్రామం పేరుతో తెలంగాణ జిల్లాల్లో భారీ బహిరంగ సభలు, సదస్సులు ఢిల్లీలో తెలంగాణ జాతర నిర్వహించి ఉద్యమ స్ఫూర్తిని విస్తరింపజేశారు. సాగరహారం, మిలియన్ మార్చ్, రైల్ రోకో, రాస్తారోకో, వంటా- వార్పు వంటి అనేక కార్యక్రమాలు చేపట్టారు.

యువ తెలంగాణ పార్టీ స్థాపన

యువ తెలంగాణ జేఏసీ నుంచి యువ తెలంగాణ పార్టీని ఏర్పాటు చేశారు. వ్యవస్థాపక అధ్యక్షునిగా జిట్టా బాలకృష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాణి రుద్రమ బాధ్యతలు తీసుకున్నారు. పాడి రైతులకు లీటరు పాలకు నాలుగు రూపాయల ప్రోత్సాహకం అందించేందుకు యువ తెలంగాణ ఆధ్వర్యంలో ప్రగతి భవన్‌ను ముట్టడించారు. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే వరకు ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వ విధానాలపై, గల్ఫ్ కార్మికుల సమస్యలపై, కళాకారుల సమస్యలపై, ప్రైవేట్ కంపెనీల్లో స్థానికులకు 80శాతం రిజర్వేషన్ కోసం, బస్వాపురం భూ నిర్వాసితుల కోసం, అసైన్డ్ భూముల విషయంపై పోరాటం చేశారు. ఫార్మా కంపెనీల వల్ల చౌటుప్పల్, భూదాన్ పోచంపల్లి, బీబీనగర్ పరిసర ప్రాంతాలు విషతుల్యం అవుతుండడంతో వాటిపై నియంత్రణ కోసం పోరాటం చేశారు.

ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం

2019 సెప్టెంబర్ 15న రాష్ట్రంలో టీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చాక.. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చకపోగా, ప్రశ్నించే గొంతుకలను నొక్కేస్తున్న తరుణంలో.. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

బీజేపీలో విలీనం

ఉద్యమ ఆకాంక్షల సాధన కోసం యువ తెలంగాణ పార్టీని 2022 ఫిబ్రవరిలో బీజేపీలో విలీనం చేశారు. 2022, జూన్2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భారతీయ జనతా పార్టీ పరంగా నిర్వహించిన ఉద్యమ ఆకాంక్షల సాధన సభకు కన్వీనర్‌గా నియమితులై సభ నిర్వహించారు. అప్పుడు జిట్టా బాలకృష్ణారెడ్డిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్రలో సహ ప్రముఖ్ గా నియమితులై చురుగ్గా పనిచేశారు. ఆ తర్వాత పార్టీ విధానాలను ప్రశ్నించి బీజేపీ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారు. అసెంబ్లీ ఎన్నికల ముందు 2023లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన జిట్టా ఆ తర్వాత కొన్ని రోజులకే అక్టోబర్ 20న బీఆర్ఎస్‌లో చేరారు. సొంత ఇంటికి చేరుకున్నానని ప్రకటించారు. చివరిసారిగా జనవరిలో సంక్రాంతి పండుగ సందర్భంగా భువనగిరిలో సంక్రాంతి సంబురాలు, జిల్లా స్థాయి గ్రామీణ క్రీడలు నిర్వహించారు. పలువురు తెలంగాణఉద్యమకారులను సన్మానించారు.

తెలంగాణ సంబురాలు నిర్వహించిన మొదటి నేత

- తెలంగాణ చరిత్ర, సంస్కృతిని ఢిల్లీ దాకా పరిచయం చేసిన నాయకుడు

జిట్టా బాలకృష్ణారెడ్డి తెలంగాణ మలి దశ ఉద్యమానికి తెలంగాణ సంస్కృతి, సంబురాలను జత చేసి కొత్త పుంతలు తొక్కించారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పర్యాటక, శిల్పకళా వైభవాన్ని చాటి చెప్పేలా తెలంగాణ జాతరలు, సంబురాలను నిర్వహించి ఉద్యమానికి ఊపు తీసుకువచ్చారు. భువనగిరి ఖిల్లాను విద్యుత్ కాంతుల వెలుగులో ప్రపంచానికి తెలియజేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, వంటకాలను భువనగిరి నుంచి ఢిల్లీ ఎర్రకోట వరకు పరిచయం చేశారు. భువనగిరిలో 2007 ఫిబ్రవరిలో మొదటి సారిగా తెలంగాణ సంస్కృతీ, వంటకాలు, పండగలపై 'తెలంగాణ జాతర' నిర్వహించారు. జాతర సభలో తెలంగాణలో మొదటి సారిగా కేసీఆర్‌కు గొర్రెపిల్ల, గొంగడి బహూకరించి గొల్ల కురుమల ప్రాముఖ్యతను చాటారు. 2007, మార్చిలో నిజాం కాలేజీ గ్రౌండ్స్, హైదరాబాద్ వేదికగా తెలంగాణ సంబురాలు నిర్వహించారు. 2010లో ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్ గ్రౌండ్‌లో తెలంగాణ నుంచి గంగిరెద్దు, చేనేత మగ్గం, కుమ్మరి సారె, కమ్మరి కొలిమి, వడ్రంగి, చేతివృత్తుల పనిముట్లు, కోయ, డప్పు, డోలు, చిందు, యక్షగానం, బోనాలు, బతుకమ్మ వివిధ కళారూపాలతో పాటు కళాకారులతో ఉత్సవం చేశారు. తెలంగాణ వంటకాల ప్రదర్శన ఏర్పాటు చేసి, తెలంగాణ జాతర నిర్వహించారు. 2007 తెలంగాణ సంబురాలలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని పరిచయం చేసి ఇప్పటికి బిఆర్ఎస్ తెలంగాణ భవన్‌లో మొట్టమొదటి తెలంగాణ తల్లి విగ్రహాన్ని జిట్టా సొంత ఖర్చుతో ఏర్పాటు చేయించారు.

చివరి వరకూ నెరవేరని కల

- ప్రజాప్రతినిధి కాకుండానే కన్నుమూసిన జిట్టా బాలకృష్ణారెడ్డి

వివిధ పార్టీల్లో చేరినా ప్రధాన పార్టీలేవీ జిట్టా బాలకృష్ణారెడ్డికి టికెట్ ఇవ్వలేదు. స్వతంత్ర అభ్యర్థిగా పలుమార్లు అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచారు. 2004 నుంచి 2018 వరకు భువనగిరి నుంచి అసెంబ్లీకి పోటీ చేసినా ఆయన గెలుపందుకోలేకపోయారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2003 డిసెంబర్ 28న జిట్టా బాలకృష్ణారెడ్డి టీఆర్ఎస్ పార్టీలో చేరారు. టీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. 2004లోనే భువనగిరి అసెంబ్లీ టికెట్ ఇస్తామని పార్టీ అధినేత కేసీఆర్ హామీ ఇచ్చినప్పటికీ సీనియర్ నేత ఆలె నరేంద్ర భువనగిరి నుంచి పోటీచేశారు. బాలకృష్ణారెడ్డి ఆ ఎన్నికల్లో నరేంద్రకు మద్దతు ఇచారు. 2009లో మహాకూటమి పొత్తుల్లో భాగంగా భువనగిరి సీటును సిట్టింగ్ స్థానాన్ని టీడీపీకి కేటాయించారు. దీంతో జిట్టా టీఆర్ఎస్ పార్టీని వదిలారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయగా.. 43,720 ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు. ఆ ఎన్నికల తర్వాత జిట్టా బాలకృష్ణారెడ్డి వైఎస్ రాజశేఖరరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం 2009 డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇస్తూ ప్రకటన ఇచ్చింది. కానీ ఆ వెంటనే కొద్ది రోజులకే డిసెంబర్ 23వ తేదీన తెలంగాణ ప్రకటన వెనక్కి తీసుకోవడంతో జిట్టా కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. భువనగిరిలో 2014 ఎన్నికల్లో యువ తెలంగాణ పార్టీ నుంచి పోటీ చేయగా 39,270 ఓట్లు వచ్చాయి. 2018 ఎన్నికల్లో బీజేపీ మద్దతులో యువ తెలంగాణ పార్టీ నుంచి పోటీచేసి ఓడిపోయారు. మూడు సార్లు వరుస ఓటములు చవిచూశారు. ఆస్తులు అమ్ముకుని ఆర్థికంగా దెబ్బతిన్నా... గుండె ధైర్యం వీడకుండా తెలంగాణ రాష్ట్రం వచ్చాక కూడా ప్రజాసమస్యల పరిష్కారమే ఎజెండాగా పోరాటాలు కొనసాగించారు. ప్రజల కోసం తన జీవితాన్ని, ఆస్తిపాస్తులను, రాజకీయాలను, భవిష్యత్తును త్యాగం చేసిన జిట్టాను ఆయన అభిమానులు కొనియాడుతున్నారు.

ఉద్యమనేతకు అశ్రు నివాళి

భువనగిరి, భువనగిరి టౌన్ : బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకుడు జిట్టా బాలకృష్ణరెడ్డి మృతి పట్ల ప్రముఖులు నివాళులర్పించారు. భువనగిరి పట్టణం సమీపంలోని ఫామ్‌హౌస్‌లో ఆయన పార్థీవదేహానికి రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు హరీష్‌రావు, జి.జగదీష్‌రెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మందుల సామేల్, శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, కోదండరాం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాప అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిశోర్, గొంగిడి సునిత, డాక్టర్ నగేష్, కంచర్ల భూపాల్‌రెడ్డి, తెలంగాణ ఉద్యమ నాయకుడు చెరుకు సుధాకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గూడూరు నారాయణరెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు, , నాయకులు బాలరాజ్ యాదవ్, కోల్పుల అమరేందర్, మందడి ఉపేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రుద్రమాదేవి తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఫామ్‌హౌస్ నుంచి అంతిమయాత్ర

జిట్టా బాలకృష్ణారెడ్డి అంతిమ యాత్ర తన ఫామ్ హౌస్ నుంచి సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమైంది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో అంతిమయాత్ర టీచర్స్ కాలనీ మీదగా స్వగ్రామమైన బొమ్మాయిపల్లికి సాగింది. ఆయన స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. కళాకారులు పెద్ద ఎత్తున ఆటపాటలతో అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ అంతక్రియలు రాత్రి 8.30 గంటలకు ముగిశాయి. బాలకృష్ణారెడ్డి కుమారుడు వివేకానందరెడ్డి తలకొరివిపెట్టారు. ఆ సమయంలో బాలకృష్ణారెడ్డి భార్య సునిత, కుమార్తె ఝాన్సీ, తండ్రి బాల్‌రెడ్డి బోరున విలపించారు. అంతమయాత్ర సందర్భంగా ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి జిట్టా పాడె మోశారు. బాలకృష్ణారెడ్డిని కడసారి చూసేందుకు సమీప ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. జిట్టా పార్థీవదేహాన్ని కంటతడి పెట్టారు. ప్రజలు పెద్ద సంఖ్యలో రావడంతో మూడు కిలో మీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.


జిట్టా సతీమణిని ఓదారుస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కన్నీరు పెట్టుకున్న మాజీ ఎమ్మెల్యే

జిట్టా బాలకృష్ణారెడ్డితో తన స్నేహాన్ని గుర్తుచేసుకుని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి కన్నీరుపెట్టుకున్నారు. జిట్టా బాలకృష్ణారెడ్డి పార్థీవదేహాన్ని చూసి బోరున విలపించారు. రెండు సార్లు ఎన్నికల్లో ప్రత్యర్థులుగా తలపడినప్పటికీ.. స్నేహం వేరు రాజకీయం వేరు అని అక్కడి ప్రజలు వ్యాఖ్యానించడం గమనార్హం.

పలువురి ప్రజాప్రతినిధుల మాటలు ఇవీ..

- అన్ని పార్టీలు జిట్టా బాలకృష్ణారెడ్డిని మోసం చేశాయని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. జిట్టా పేరు మీద ఏదైనా కార్యక్రమం నిర్వహించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.
- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఢిల్లీ వరకు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను తెలియజేసిన వ్యక్తి జిట్టా అని అన్నారు. జిట్టా మృతిచెందితే కనీసం కేసీఆర్ రాకపోవడం బాధాకరమన్నారు. - ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తి జిట్టా అని అన్నారు. ఊరూరా వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన ఘనత జిట్టాకు దక్కుతుందన్నారు. హైదరాబాద్‌లో తెలంగాణ సంబురాల పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో జిట్టా తెలంగాణకళలకు గుర్తింపు తీసుకు వచ్చారని చెప్పారు.
- ఎమ్మెల్యే మందు సామేల్ మాట్లాడుతూ.. 2003 నుంచి జిట్టా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కృషి చేసిన నాయకుడు అని, మచ్చలేని నాయకుడు అని అన్నారు.
- ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తి జిట్టా బాలకృష్ణారెడ్డి అని అన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని యువత రాజకీయాల్లోకి వచ్చారని అన్నారు. నాయకుడిగా ఎదిగి చట్ట సభల్లో ఉండాల్సిన మంచి వ్యక్తి మృతిచెందడం బాధాకరమన్నారు.


జిట్టా మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కుడుదుల నగేష్


కన్నీటి పర్యంతమవుతున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి


బాలకృష్ణారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య


నివాళులర్పిస్తున్న తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి


జిట్టా బాలకృష్ణారెడ్డి, కుమార్తె, సతీమణి, కుటుంబ సభ్యుల రోదనలు


తండ్రి మృతదేహం వద్ద రోదిస్తున్న కుమారుడు


జిట్టా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత


రోదిస్తున్న డాక్టర్ చెరుకు సుధాకర్, జిట్టా స్నేహితులు









